క్లుప్తంగా

శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకీ సేవ చేశారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు నిర్వహించి రంగురంగుల పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అందంగా అలంకరించి భక్తుల దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉత్స వమూర్తులకు కూడా అభిషేకాలు, పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు అందంగా అలంకరించి ఆలయ మాఢవీధులలో, ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఈ పల్లకీ సేవలో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ఈ పల్లకీ సేవలు ఆలయ ఈవో డి.వి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి, ఆలయ వేదపండితులు రాచ రాయయోగి స్వాములు నిర్వహించారు. అలాగే స్వామి వారి దర్శానికి వచ్చిన స్థానిక, కన్నడ భక్తులకు ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా అన్నదానం ఏర్పాటు చేశారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

చిట్వేలి : చిట్వేలి శ్యామలాంబ సమేత సోమేశ్వ రాలయంలో సోమవారం ఆలయ అర్చకులు పవన్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం, మహా నైవేద్యం, మంత్రపుష్పం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్యామలాంబ దేవిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర శర్మ, భక్తులు పాల్గొన్నారు. అలాగే పాత చిట్వేలి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని స్తంభాలరాయుడు ఆలయం సమీపాన నూతనంగా నిర్మించిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

జ్వరంతో వ్యక్తి మృతి

పుల్లంపేట : పుల్లంపేటలో నివాసం ఉంటున్న నరసింహ (50) అనే వ్యక్తి సోమవారం తీవ్ర జ్వరంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నరసింహ జీవనోపాధి కోసం గల్ఫ్ దేశంలో 20 సంవత్సరాలుగా ఉంటూ.. మూడు నెలల క్రితం గ్రామానికి వచ్చాడు. నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నరసింహ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పేదలకు భూ పంపిణీ చేయాలి


తహసీల్దార్ పీర్ మున్నీకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్రంలో కొందరి ఆధీనంలో అక్రమంగా ఉన్న భూములను వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయాలని సోమవారం రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక టోల్ గేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, గిరిజనులకు వ్యవసాయ భూములు పంచాలని కోరుతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని, కానీ మల్టీనేషన్ కంపెనీలకు వేలాది ఎకరాలు దోచి పెడుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పండుగోలు మణి, దార్ల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం


రక్తదాన శిబిరాన్ని సందర్శించిన రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి

రాజంపేట : రక్తదానం ప్రాణదానంతో సమానమని రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవి అన్నారు. సోమవారం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన సందర్భంగా జనసేన పార్లమెంటరీ ఇన్‌చార్జి యల్లటూరు శ్రీనువాసరాజు ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువతీ యువకులను వారు అభినందించారు. కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సంగరాజు బాలరాజు, రాజంపేట ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డా.పీవీఎస్‌రాజు, ప్రముఖ గైనకాలజిస్టు డా.చట్టేటి అనిల్‌కుమార్, పట్టణ సీఐ యల్లమరాజు, రూరల్ సీఐ బీవీ రమణ, మన్నూరు సీఐ రామాంజనేయుడు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు పరామర్శ

రైల్వేకోడూరు అర్బన్ : వీవీ కండ్రిక సర్పంచ్ శ్రీరాం వినోద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్‌ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

తెలుగు ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్


రామాపురం: వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి, నాయకులు


లక్కిరెడ్డిపల్లి: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


సంబేపల్లెలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి : దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ తెలుగు ప్రజల గుండె చప్పుడు అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. వైఎస్సార్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్ 15వ వర్థంతి సందర్భంగా రాయచోటిలోని చిత్తూరు రింగ్ రోడ్డు సర్కిల్, బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్ విగ్రహాలకు మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, జడ్పీటీసీ వెంకటేశ్వరరెడ్డి, మండల బీసీ నాయకుడు పల్లపు రమేష్, మాజీ డీసీసీబీ డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్ తదితర నాయకులతో కలిసి శ్రీకాంత్ రెడ్డి నివాళులు అర్పించారు.

క్షీరాభిషేకం

రాయచోటిలోని దివంగత నేత వైఎస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి, గజమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో నీటి ప్రాజెక్టులతో పాటు మన ప్రాంతంలోని వెలిగల్లు, ఝరికోన, శ్రీనివాసపురం ప్రాజెక్టులను నిర్మించిన ఘనత మహానేత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు జాకీర్, సుగవాసి శ్యామ్, ఫయాజ్ అహ్మద్, షబ్బీర్, రియాజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, రౌనక్, గౌస్ ఖాన్, జానం రవీంద్ర యాదవ్, మురికినాటి వెంకట్రామిరెడ్డి, అల్తాఫ్, కో–ఆప్షన్ అయ్యవారు రెడ్డి, హజరత్ ఖాదర్ వల్లి, మాజీ కౌన్సిలర్ ఆనందరెడ్డి, చంద్రశేఖర్, బీసీ సెల్ విజయ భాస్కర్, సంబేపల్లి మండల జేసీఎస్ కన్వీనర్ వడ్డి వెంకటరమణా రెడ్డి, మోటకట్ల అమర్నాథరెడ్డి, వివి ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహానేతను మరువలేం

రైల్వేకోడూరు అర్బన్ : మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని మరువలేమని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు కొనియాడారు. సోమవారం వైఎస్సార్ 15 వర్ధంతిని పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రజలకు సువర్ణ పాలన అందించి సంక్షేమ పథకాలతో దేశంలోనే చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ మారెల్ల రాజేశ్వరి, సీహెచ్.రమేష్, మండల నాగేంద్ర, అన్వర్‌బాషా, ముస్తాక్, ముజీబ్, మండల శివయ్య, జనార్దన్‌రాజు, కొరెడ్డి సిద్దయ్య, నందాబాల, రౌఫ్, సుబ్బరామరాజు, రామకృష్ణ, హరికృష్ణారెడ్డి, రాజ, లక్ష్మినారాయణమ్మ, అరుణ, జ్యోతి, వెంకటరెడ్డి, ఆర్వీరమణ, చంద్రశేఖర్, రఘు, రవిలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి : పేదల గుండెల్లో దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెరగని ముద్ర వేశారని అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్ కొనియాడారు. వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక మూడు రోడ్ల కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. మండలంలోని కస్తూరిరాజుగారిపల్లె గ్రామం, చాగలగుట్టపల్లె, దిన్నెపాడు గ్రామం, నరసింహారాజుగారిపల్లె, బెస్తపల్లె ఎస్సీ కాలనీ, కోనంపేట, పందిళ్లపల్లె కస్బాలలోని వైఎస్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మమ్మ, సుబ్బరాయుడు, సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కల్యాణి ప్రభాకర్ రెడ్డి, కాలాడి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్

సంబేపల్లె : సంక్షేమ సారథి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని మరువలేమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి కొనియాడారు. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఉపేంద్రనాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సంబేపల్లెలో వైఎస్‌ఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో డైరెక్టర్ వెంకట్రామిరెడ్డి, వి.వి ప్రతాప్‌రెడ్డి, వి.వి రమణారెడ్డి, నాగరాజుయాదవ్, వాసుదేవరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ రామచంద్ర, అన్నారెడ్డి, బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మబంధువు వైఎస్సార్

నందలూరు : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా నందలూరు బస్టాండ్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు సిద్దవరం గోపిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గంపా సుధాకర్, త్రినాథ్, నడివీధి సుధాకర్, హెచ్ ఆనంద్ కుమార్, గీతాల నరసింహారెడ్డి, సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాల నాగసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా మహానేతకు నివాళి

సిద్దవటం : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ సిద్దవటం మండల నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సిద్దవటం మండలంలోని భాకరాపేట మూడు రోడ్ల కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి సోమవారం క్షీరాభిషేకం చేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి పల్లె సుబ్బరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్ 15వ వర్ధంతి

రాజంపేట రూరల్ : పట్టణంలోని పాతబస్టాండు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద, వైఎస్సార్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఆ ఆపార్టీ సీనియర్ నాయకులు పోలా వెంకటరమణారెడ్డి సోమవారం నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మర్రి రవికుమార్, వడ్డే రమణ, దండు గోపి, మిరియాల సురేఖ, రమణమ్మ, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, దాసరి పెంచలయ్య, సత్యాల రామకృష్ణ, పాపినేని విశ్వనాథరెడ్డి, డీ బాస్కర్‌రాజు, ఆర్ రమేష్‌నాయుడు, గోవిందు బాలకృష్ణ, జీవీ సుబ్బరాజు, ఎ మధుబాబు, జేవీ కృష్ణారావు, సనిశెట్టి నవీన్‌కుమార్, డీలర్ సుబ్బరామిరెడ్డి, సి రఘురామిరెడ్డి, పీ రఘునాథరెడ్డి, రెడ్డెయ్య, రమణ, వై శ్రీనివాసగౌడ్, ఎస్ శ్రీనివాసులు, బీ పెంచలయ్య, పెంచలరెడ్డి, మైనారిటీ నాయకులు ఎస్ జావీద్‌అలీ, మునాఫ్, ఖాజామొహిద్దీన్, షాకీర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాత వైఎస్సార్

గాలివీడు : అభివృద్ధి, సంక్షేమ ప్రదాత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్, వైస్ ఎంపీపీ మిట్టపల్లె యదుభూషణ్‌రెడ్డి కొనియాడారు. సోమవారం వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా మండలంలో పలు గ్రామాలలోని వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు.

సుండుపల్లె : వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు యర్రపురెడ్డి అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఇస్మాయిల్, మధుసూదన్ రెడ్డి, రెహమాన్ ఖాన్, రహీంబాషా, సల్మాన్, మాజీ ఎంపీటీసీ చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లి : మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా వీరబల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి, అలాగే హరిజనవాడలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గాలివీటి విజయ భాస్కర్ రెడ్డి, మండల వైసీపీ నాయకుడు వీరనాగిరెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పుల్లంపేట : దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ రామనాథం, మండల సీనియర్ నాయకులు కమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జైశంకర్ నాయుడు, సీనియర్ నాయకులు రాజారెడ్డి, పుల్లంపేట సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, ఎంపీటీసీ పార్థసారధి, సుదర్శన్ రెడ్డి, బికె మణి, సుబ్బారెడ్డి, ఆలం చెంగయ్య, సిద్దారెడ్డి, నూర్ మహ్మద్, నాసిర్, సయ్యద్ రిజ్వాన్, ఏ సుదర్శన్, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

రైతు బాంధవుడు వైఎస్సార్

రామాపురం : సంక్షేమ సారథి దివంగత నేత డాక్టర్ వైఎస్సార్ అని మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలో సోమవారం డాక్టర్ వైఎస్సార్ 15వ వర్ధం సందర్భంగా వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మాట్లాడుతూ తెలుగు నేలపై వైఎస్సార్ చెరగని ముద్ర వేశారని తెలిపారు. వైఎస్సార్ రైతు బాంధవుడని కొనియాడారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, జెడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, మాజీ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్ ఇరగం రెడ్డి సుబ్బారెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడాభవన్‌లో వైఎస్సార్‌కు నివాళి

రాజంపేట: రాజంపేట బైపాస్‌లోని మేడాభవన్‌లో దివంగత సీఎం వైఎస్‌రాజశేఖర్‌రెడ్డికి వర్ధంతి సందర్భంగా నివాళి సభ నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజంపేట వ్యవసాయమార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనరు జె.కృష్ణారావుయాదవ్, వైఎస్సార్ సీపీ నేతలు తంబెళ్ల వేణుగోపాల్‌రెడ్డి, మేడాబాబురెడ్డి, తాళ్లపాక మధు, నందలూరు వైఎస్సార్‌సీపీనేతలు సోమిశెట్టి ప్రభాకర్, పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, తాళ్లపాక సర్పంచి గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నమండెం : మండల వ్యాప్తంగా దివంగత మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చాకిబండ గ్రామంలోని వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు పాల్గొన్నారు.


నందలూరు: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వీరబల్లి : వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు


చిన్నమండెం వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ శ్రేణులు


వైఎస్సార్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి


ఒంటిమిట్టలో..


సిద్దవటం: భాకరాపేటలో..


సుండుపల్లెలో..


రాజంపేట రూరల్: వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


గాలివీడులో..


పుల్లంపేటలో..

చవితి మండపాలకు అనుమతి తప్పనిసరి

సిద్దవటం: వినాయక చవితి సందర్భంగా పందిరి, మండపాలకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్ తెలిపారు. సిద్దవటం పోలీసు స్టేషన్‌లో సోమవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వినాయకుని పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. వినాయక ఉత్సవాలకు 15 మంది సభ్యుల కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 3,6,7,9 తేదీల్లో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, పోలీసులు, ప్రజలు పాల్గొన్నారు.

నందలూరు: వినాయక చవితి సందర్భంగా బహిరంగ ప్రదేశాలలో వినాయకుని మండపాలను ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలని మన్నూరు సీఐ బివి రమణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు సింగిల్ విండో విధానాన్ని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

ఒంటిమిట్ట : వినాయక చవితిని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్ఐ శివప్రసాద్ కోరారు. సోమవారం గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో ఎటువంటి అల్లర్లకు, గొడవలకు పాల్పడకుండా వినాయక చవితి వేడుకలను సంతోషంగా ఘనంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా నియమ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు నాయక్

సింగల్‌విండో విధానంలో అనుమతి

రాజంపేట : సింగల్‌విండో విధానంలో గణేష్ ఉత్సవాలకు అనుమతిస్తామని రాజంపేట అర్బన్ సీఐ యల్లమరాజు అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనుమతులను సులభతరం చేయడానికి ప్రత్యేకపోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించిందన్నారు. ప్రజలు సులభతరంగా గణేష్ ఉత్సవాలు నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి మీ–సేవలో చలనా రుసుం చెల్లించాలన్నారు. వినాయక ఉత్సవ కమిటీ పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రశాంత వాతవరణంలో భక్తి శ్రద్ధలతో చవితి ఉత్సవాలు జరుపుకోవాలని సీఐ కోరారు.

శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలి

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి చుట్టుపక్కల క్రైస్తవులు మృతి చెందితే అంత్యక్రియలు నిర్వహించేందుకు శ్మశాన వాటికను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్‌కు అన్నమయ్య జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. రాయచోటి తాలూకా చుట్టుపక్కల 900 క్రైస్తవ కుటుంబాలున్నాయని, వీరిలో ఎవరైనా మరణిస్తే భూస్థాపన చేసేందుకు ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. రాయచోటి పట్టణంలో చుట్టుపక్కల మండలాల్లో ఉన్న క్రైస్తవ కుటుంబాలకు స్థలం కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఫాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్మశానవాటికకు స్థలం కేటాయించండి సారూ

రాయచోటి అర్బన్ : స్మశానవాటికకు స్థలం కేటాయించాలంటూ గుర్రంకొండ మండలం నడిమ కండ్రిగ గ్రామం ఎగువ దళితవాడ వాసులు సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా లిబరేషన్‌పార్టీ జిల్లా నేత విశ్వనాథ మాట్లాడుతూ నడిమరాజు కండ్రిగ గ్రామం దళితవాడలో సుమారు 100 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కలెక్టర్ జోక్యం చేసుకుని స్మశానానికి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఆర్ఓ సత్యనారాయణకు వినతిపత్రం అందచేశారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

రైల్వేకోడూరు అర్బన్ : కోడూరు మండలంలో పలు ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించడం లేదని ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. వరదల కారణంగా ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సెలవులు ప్రకటిస్తే కోడూరులో కొన్ని ప్రైవేటు పాఠశాలలు 10 వతరగతి విద్యార్థులకు క్లాసులు నిర్వహించాయని తెలిపారు. మండల విద్యాధికారికి సమాచారమిస్తే నిర్లక్ష్యం వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవదీప్, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం ఇవ్వాలి


మాట్లాడుతున్న డీహెచ్‌పీయస్ జిల్లా కార్యదర్శి సుధీర్‌కుమార్

రాయచోటి అర్బన్ : జిల్లావ్యాప్తంగా నమోదైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని వెంటనే ఇప్పించాలని డీహెచ్‌పీఎస్ నేతలు కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతి పత్రం అందచేశారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో డీహెచ్‌పీయస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా నమోదైన 70 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు ఎఫ్ఐఆర్, చార్జీషీట్ స్థాయిలో విచారణలో ఉన్నాయని తెలిపారు. ఎఫ్ఐఆర్ స్థాయిలో 25 శాతం, చార్జిషీటు స్థాయిలో 50 శాతం నిధులను కేసులను బట్టి పరిహారాన్ని బాధితులకు చెల్లించాలని కోరారు. సమావేశంలో డీహెచ్‌పీయస్ నేతలు పెద్ద గంగులయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయానికి విరాళం

చిట్వేలి : చిట్వేలి మండలం, మంగళంపల్లి ప్రధాన రహదారిలోని శ్రీ స్తంభాలరాయుడు స్వామి ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయానికి భక్తులు సోమవారం రూ. 38.86 లక్షల విరాళాలను అందించినట్లు ఆలయ కమిటీ తెలిపింది. నందలూరు మండలం, ఆడపూరుకు చెందిన పెనగలపాటి నారాయణ సతీమణి రుక్మిణమ్మ, కుమారుడు రమేష్ నాయుడు, కోడలు మహేశ్వరి వారి కుటుంబ సభ్యులు రూ. 10,00,116లు, గతంలో కూడా వీరు రూ. 10,00,000 అందజేశారు. అలాగే రైల్వేకోడూరు మండలం, కె బుడుగుంటపల్లికి చెందిన తిరుపతి, మోహన్ సతీమణి కాంతమ్మ కుమారుడు, హరికుమార్, కోడలు సత్యవతి, మనువరాళ్లు హాసిని, మొనాలిశా, కుటుంబ సభ్యులు రూ. 5,00,116, అలాగే పుల్లంపేట మండలం పివిజిపల్లికి చెందిన కె నారాయణయ్య, సతీమణి సావిత్రమ్మ, కుమారుడు వెంకటేశ్వర ప్రసాద్, కోడలు సుభాషిణి, మనువరాలు సుజశ్రీ, మనువడు వర్షిత కుటుంబ సభ్యులు రూ. 5,00,116లు, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన బత్తల వెంకటసుబ్బయ్య, సతీమణి నారాయణమ్మ, కుమారుడు హరీష్, కోడలు భవాణి కుటుంబ సభ్యులు రూ. 1,50,116లు, చిత్తూరు జిల్లా పుత్తూరు మండలం, పరమేస్వర మంగళంకు చెందిన మోటుపల్లి రమేష్‌నాయుడు, సతీమణి ఝాన్సీ రాణి, కుటుంబ సభ్యులు రూ. 1,00,000లు, చిట్వేలి మండలం గుట్లవారిపల్లికి చెందిన పెనగలూరు నరసింహులు, సతీమణి విజయలక్ష్మీ కుటుంబ సభ్యులు రూ. 50,116లు, రాజంపేట మండలంకు చెందిన కీ.శేలు రేవూరు రామయ్య కుమార్తె8 చెన్నమ్మ కుటుంబ సభ్యులు రూ. 20,116లు, చిట్వేలి మండలం గాంధీనగర్‌కు చెందిన కీ.శేలు ఓబిలి సుబ్బయ్య సతీమణి మునిరత్నమ్మ కుటుంబ సభ్యులు రూ. 15,116లు మొత్తం రూ. 38,86.044లు భక్తులు విరాళాలను అందజేశారు.


నూతనంగా నిర్మించిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం

క్యాబ్ డ్రైవర్లకు ఎన్నికల బిల్లులు చెల్లించాలి

రాయచోటి అర్బన్ : పార్లమెంటు, అసెంబ్లీ, ఎన్నికల నిర్వహణలో అధికారులు వినియోగించుకున్న ప్రైవేటు క్యాబ్‌డ్రైవర్లకు చెల్లించాల్సిన బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, కార్యదర్శి ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. అద్దె బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేటు వాహన డ్రైవర్లు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల నిర్వహణ కోసం 42 వాహనాలను అధికారులు వినియోగించుకున్నారని తెలిపారు. వెంటనే అద్దె చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో క్యాబ్ డ్రైవర్లు షేక్ ఆయేషావలి, రమణ, నాయుడు, సత్య, సుందరం, సైదులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలి

ఓబులవారిపల్లె : నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ పీర్ మున్నీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గ సీపీఐ నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్పటి నుంచీ నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోల్ ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పెరిగాయన్నారు. దీంతో ప్రజలు ఏమీ కొనలేని, తినలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీపీఐ నాయకురాలు చింతలపూడి నాగమ్మ, తిరుమలయ్య, దార్ల నాగేశ్వర్, శివయ్య, సుధాకర్, గోపాల్ పాల్గొన్నారు.